
సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం, 19, జూన్, 2023



కాయలు చెట్లకే! IIలో

మామిడి రైతుకు కష్టకాలం దాపురించింది. ఎగుమతులు లేకపోవడంతో చెట్ల నుంచి కాయలను కోసేందుకు ఆసక్తి చూపడం లేదు.



వ్యాను బోల్తా IIలో

గంగవరం మండలం బర్రిమామిడి సమీపంలో ఓ వ్యాను బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, పది మంది గాయపడ్డారు.



పోర్టు సరికొత్త రికార్డు IIలో

24 గంటల కాల వ్యవధిలో 4,01,875 మెట్రిక్ టన్నుల సరకును 23 షిప్పుల నుంచి వివిధ బెర్తుల ద్వారా హ్యాండ్లింగ్ చేసింది.

న్యూస్‌రీల్

'అల్లం'త దూరాన..

- కిలో రూ.250



ధర అధికంగా పలుకుతున్న అల్లం

ముంచంగిపుట్టు: అల్లం ధర ఘాటెక్కింది. ప్రస్తుతం వారపు సంతలకు అల్లం ఆశించిన స్థాయిలో రాకపోవడంతో డిమాండ్ పెరిగింది. దీంతో వ్యాపారులు అల్లం ధరను అమాంతం పెంచేశారు. నెల రోజుల వ్యవధిలోనే ధరలో చాలా వ్యత్యాసం కనిపించింది. గత నెల కిలో అల్లం ధర రూ.100 ఉండగా, ప్రస్తుతం కిలో రూ. 220 నుంచి 250 వరకు ఉంది. అల్లం పంట దిగుబడి ఈ ఏడాది తగ్గడమే ధర పెరుగుదలకు కారణమని వ్యాపారులు తెలిపారు.

సింగంపల్లి విద్యార్థికి కలెక్టర్ అభినందన



రాజ్‌కుమార్‌ను అభినందిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

రాజవొమ్మంగి: మండలంలోని సింగంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి జాగు రాజ్‌కుమార్ టెన్త్ పరీక్షల్లో 549 మార్కులు సాధించి ప్రభుత్వం ప్రకటించిన ఆణిముత్యం అవార్డుకు ఎంపికై కలెక్టర్ అభినందనలు అందుకున్నాడు. శనివారం కలెక్టర్ సుమీత్‌కుమార్ చేతులమీదుగా రాజ్‌కుమార్ అవార్డుతో రూ.50వేలకు చెక్కు అందుకున్నాడు.రాజ్‌కుమార్ తండ్రి శ్రీనివాస్ సింగంపల్లిలో కౌలుకు భూమి తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు.

అడ్డతీగల సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా సతీష్



అడ్డతీగల: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్‌గా పండా సతీష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆరు నెలల నుంచి ఇదే ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న ఈయనకే సూపరింటెండెంట్ విధులు అప్పగిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. సామాన్య ప్రజలు ఎక్కువగా వచ్చే ఈ ఆస్పత్రిలో వైద్యసేవలు అందించడంలో లోటుపాట్లు లేకుండా బాధ్యతలు నిర్వహిస్తామని సతీష్ తెలిపారు.

మోదమ్మకు నీరాజనం



పాడేరులోని మోదమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబాలతో సహా పాడేరుకు చేరుకుని అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. స్థానికులు ఇంటి పండగలు జరుపుకొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ నెలకొంది.భక్తులకు ఉచితంగా ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం వియ్యపు అప్పలరాజు కుటుంబం అన్న సమారాధన నిర్వహించింది.

విద్యుత్ బిల్లులపై ఫేక్ లింక్స్ నమ్మొద్దు

- ఈపీడీసీఎల్ అధికారుల విజ్ఞప్తి

సాక్షి, విశాఖపట్నం : బిల్లులు చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ కట్ చేసేస్తామంటూ రాత్రి సమయంలో వస్తున్న ఫోన్ కాల్స్, ఫేక్ లింక్స్, మెసేజ్‌లను వినియోగదారులు విశ్వసించవద్దని ఏపీఈపీడీసీఎల్ అధికారులు విజ్ఞప్తి చేశారు. బిల్లులు చెల్లించకపోతే ఫ్యూజ్‌లు వెంటనే తీసేస్తామంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని సూచించారు. ఈపీడీసీఎల్ సిబ్బంది, కాల్ సెంటర్ నుంచి బిల్లుల చెల్లింపుపై సాయంత్రం 5 నుంచి ఉదయం 8 గంటల మధ్యలో ఎలాంటి కాల్స్, మెసేజ్‌లు, లింక్స్ రావన్నారు. గూగుల్ ప్లేస్టోర్‌లో ఉన్న ఈస్టర్న్ పవర్ యాప్, భీమ్ యాప్, పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే, నెఫ్ట్/ఆర్టీజీఎస్, టీఏ వాలెట్, బిల్ డెస్క్, పే యూ వెబ్ ద్వారా మాత్రమే బిల్లులు చెల్లించాలని సూచించారు.

వరద నుంచి విముక్తి

పోలవరం ముంపు గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. వారికి మేలు జరిగేలా చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ప్రాజెక్టు పరిధిలో ఉన్న 31 గ్రామాలను ప్రాధాన్యత క్రమంలో ప్రభుత్వం గుర్తించింది. వీటికి 41.15 కాంటూరు పరిధిలో ఉన్న 67 గ్రామాల మాదిరిగా పరిహారం, పునరావాసం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. దీనివల్ల 18 వేల కుటుంబాలకు మేలు జరగనుంది.

- ప్రాధాన్యత క్రమంలో 31 గ్రామాల గుర్తింపు
- 41.15 కాంటూరు మాదిరిగానే అందనున్న పరిహారం, పునరావాసం
- 18 వేల కుటుంబాలకు లబ్ధి



ప్రాధాన్యతా క్రమంలో ముంపు జాబితాలో చేర్చిన చింతూరు మండలం చూటూరు గ్రామం

చింతూరు: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాకుండానే ఏటా వస్తున్న వరదలకు ఆ గ్రామాలన్నీ వరద ముంపునకు గురవుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు వరదల సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో ఈ పరిస్థితులు నెలకొన్నాయి.

- పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 45.72 మీటర్లు (మలిదశ) కాంటూరు పరిధిలో ఉన్న గ్రామాల వారు 41.15 మీటర్లు(తొలిదశ) కాంటూరు లెవల్ పరిధిలోని వరదకే మునిగి పోతున్నందున తమ గ్రామాలను కూడా తొలిదశ పరిధిలోకి మార్చాలని వారు అధికారుల ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.
- నిర్వాసితుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. కాంటూరు లెవెల్‌తో సంబంధం లేకుండా రెండు విడతల్లో 31 గ్రామాలను ప్రాధాన్యత క్రమంలో ముంపు జాబితాలో చేర్చింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు వరద ముంపు నుంచి విముక్తి లభించనుంది.

లిడార్ సర్వే ఆధారంగా..

2020లో వచ్చిన గోదావరి, శబరి నదుల వరద ముంపు ఆధారంగా 41.15 కాంటూరు లెవెల్లో ఎన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయో తేల్చేందుకు ప్రభుత్వం లిడార్ సర్వే చేపట్టింది. సర్వేలో భాగంగా వెల్లడైన వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో మరికొన్ని గ్రామాలను ముంపు జాబితాలో చేర్చాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీని ఆధారంగా తొలిదశలోని 67 గ్రామాలకు తోడుగా ప్రాధాన్యత క్రమంలో మరో 31 గ్రామాలు అదనంగా చేరాయి.

- వీఆర్‌పురం మండలంలో 15, కూనవరం మండలంలో 10, చింతూరు మండలంలో 6 గ్రామాలున్నాయి. ఇప్పటికే 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాలకు పునరావాస ప్రక్రియ దాదాపుగా పూర్తికాగా ప్రస్తుతం అదనంగా చేర్చిన 31 ప్రాధాన్యత గ్రామాల్లో కూడా త్వరితగతిన పరిహారం, పునరావాస ప్రక్రియ పూర్తిచేసి నిర్వాసితులను తరలించేందుకు అధికారులు గ్రామసభల నిర్వహణ మొదలుపెట్టారు.

త్వరలోనే పునరావాసం, పరిహారం



పోలవరం ప్రాజెక్ట్ 45.72 కాంటూరు లెవల్లో ఉన్న 31 గ్రామాలను ప్రాధాన్యత క్రమంలో గర్తించి ముంపు జాబితాలో ప్రభుత్వం చేర్చింది. ఏటా ముంపునకు గురవుతున్న ఆయా గ్రామాల్లో త్వరితగతిన గ్రామసభల నిర్వహణ పూర్తిచేసి పరిహారం ఇవ్వడంతో పాటు పునరావాసం కల్పిస్తాం.

– సూరజ్ ధనుంజయ్ గనోరే, ఐటీడీఏ పీవో, చింతూరు

హర్షణీయం



మా గ్రామాన్ని తొలిదశతో పాటు ముంపు జాబితాలో చేర్చడం హర్షణీయం. ఇలా ప్రభుత్వం చేర్చుతుందని ఊహించలేదు. ఆర్ అండ్‌ఆర్ ప్రక్రియ వేగవంతం చేసి పునరావాసం కల్పించాలి.

– నవలం దారయ్య, చూటూరు, చింతూరు మండలం

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



తమ ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని మా గ్రామాన్ని ప్రాధాన్యత క్రమంలో ముంపు జాబితాలో చేర్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. పొరపాట్లకు తావులేకుండా అధికారులు సర్వేలు చేపట్టాలి. దీనిపై ప్రభుత్వం కూడా ఆదేశాలివ్వాలి.

– ముచ్చిక కృష్ణకుమారి, మల్లెతోట, చింతూరు మండలం

మరిన్ని గ్రామాలను కలపాలి



మా గ్రామాన్ని ప్రాధాన్యత క్రమంలో కలిపినట్లుగానే ముంపునకు గురవుతున్న మరిన్ని గ్రామాలను కూడా చేర్చితే బాగుంటుంది. దీనివల్ల అందరికీ మేలు జరుగుతుంది. ఈ దిశగా ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపట్టాలి.

– కారం రత్తయ్య, వాల్ఫర్దుపేట, కూనవరం మండలం

గ్రామసభ నిర్వహించారు



ప్రాధాన్యత క్రమంలో చేర్చిన మా గ్రామంలో గ్రామసభ నిర్వహించి కుటుంబాల వివరాలు వెల్లడించారు. దీంతో ఎవరికైనా అభ్యంతరాలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశముంది. దీని వల్ల కూడా ప్రజలకు మేలు జరుగుతుంది.

– మడకం బ్రహ్మ, కూళ్లపాడు, కూనవరం మండలం

సమీపంలోనే పునరావాసం కల్పించాలి



ముంపును గురికాని మా భూములన్నీ ఇక్కడే ఉంటాయి. దీంతో ప్రస్తుతం మా గ్రామాలకు సమీపంలోనే పునరావాసం కల్పిస్తే వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుంది. ఈదిశగా చర్యలు చేపట్టేలా ప్రభుత్వం ఆదేశాలివ్వాలి.

– ధర్ముల భద్రయ్య, ఏజీకొడేరు, చింతూరు మండలం

వచ్చే నెల 21న విశ్వ కోయ భాష దినోత్సవం



మాట్లాడుతున్న సోడె మురళి

చింతూరు: ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలు తమ హక్కులను పరిరక్షించుకునేందుకు సాంస్కృతిక పునరుజ్జీవనం ఎంతో కీలకమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడె మురళి అన్నారు. మండలంలోని ఏజీ కొడేరులో ఆదివారం నిర్వహించిన పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 21న విశ్వ కోయభాష దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలన్నారు. ఏడు రాష్ట్రాల్లో నాలుగు కోట్లమంది మాట్లాడే కోయభాషను జాతీయ భాషగా గుర్తించాలని, ఆదివాసీలకు కూడా గోండ్వానా ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసంతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించాలని, రంపచోడవరం, చింతూరు, కన్నాపురం ఐటీడీఏల పరిధిలో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పులి వీరయ్య, పూనెం బాబూరావు, జల్లి మధు, మడకం శ్రీరాములు, సత్యనారాయణ, ముత్తయ్య, కన్నయ్య, రత్తయ్య పాల్గొన్నారు.

ఎండిపోయిన జోలాపుట్టు స్పిల్‌వే జలాశయం



పూర్తిగా ఎండిపోయిన జోలాపుట్టు స్పిల్‌వే జలాశయం

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరు అందించే జోలాపుట్టు స్పిల్‌వే జలాశయం పూర్తిగా ఎండిపోయింది.గత రెండు సంవత్సరాలుగా జూన్‌లో జలాశయంలో నీరు లేకుండా పోతుండడం ఇబ్బందికరంగా మారింది.విద్యుత్ ఉత్పత్తి చేయగలిగే సామర్థ్యం ఉన్నా తగినంత నీరు లేకపోవడంతో ఎప్పుడు విద్యుత్ ఉత్పాదన నిలిచిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. జోలాపుట్టులో పక్కపక్కనే ప్రధాన,స్పిల్‌వే జలాశయాలు ఉన్నాయి. ఈ రెండు జలాశయాల పూర్తి స్థాయి నీటి మట్టం 2,750 అడుగులు. జోలాపుట్టు ప్రధాన జలాశయంలో 2,704.80 అడుగుల నీటి మట్టం ఆదివారం నమోదు అయింది. అయితే జోలాపుట్టు స్పిల్‌వే జలాశయం పూర్తిగా ఎండిపోయి దర్శనమిస్తోంది. గత ఏడాది స్పిల్‌వే జలాశయంలో 2,689 అడుగుల నీరు ఉండేది. ఈ ఏడాది అదికూడా లేకపోయింది. ఈ రెండు జలాశయాల నీటి మట్టంపై ఆధారపడి ఉన్న డుడుమ జలాశయంలో సైతం నీటి మట్టం ఆశించిన స్థాయిలో లేదు.డుడుమ జలాశయ పూర్తిస్థాయి నీటి మట్టం 2,590 అడుగులు కాగా ప్రస్తుతం 2,583 అడుగులు ఉంది. డుడుమ జలాశయంలో నీటి స్థాయిని తగ్గకుండా చూసేందుకు గత కొన్ని రోజులుగా జోలాపుట్టు జలాశయం నుంచి రెండు గేట్లు ఎత్తి 2,500 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. రెండు,మూడు వారాల్లో వర్షాలు కురవకపోతే జోలాపుట్టు ప్రధాన జలాశయంలో సైతం నీరు అడుగంటి పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రస్తుతం మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో 6 జనరేటర్ల సాయంతో 100 మెగా వాట్ల విద్యుత్ ఉత్పాదన జరుగుతోంది.జలాశయాల్లో నీటి మట్టం స్థాయి పెరగకపోతే విద్యుత్ ఉత్పాదనకు ఆటంకం కలుగనుంది.ఎప్పుడు వర్షాలు కురుస్తాయే, జలాశయాలు ఎప్పుడు నిండుతాయోనని ఆంధ్ర–ఒడిశా జెన్‌కో అధికారులు ఎదురుచూస్తున్నారు.

ప్రశాంతంగా ఎంఈవో–2 కౌన్సెలింగ్

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 39 మండలాల్లో పోస్టింగ్
- నేడు విధుల్లో చేరనున్న ఎంఈవోలు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విశాఖ డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: ప్రతీ మండలంలో రెండో ఎంఈవో పోస్టు భర్తీ కోసమని ఆదివారం విశాఖపట్నం డీఈవో కార్యాలయంలో నిర్వహించిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖ డీఈవో ఎల్.చంద్రకళ నేతృత్వంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 46 మండలాల్లో ఎంఈవో–2 పోస్టు భర్తీ కోసమని జెడ్పీ హైస్కూళ్లలో పనిచేస్తున్న గ్రేడ్–2 హెచ్‌ఎంలకు అవకాశం కల్పించారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిధిలో జెడ్పీ హైస్కూళ్లలో అర్హులైన 267 మందితో సీనియారిటీ జాబితాను ముందుగా ప్రకటించారు. దీనిపై అభ్యంతరాలు స్వీకరించిన తరువాత ఫైనల్ జాబితా మేరకు ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. 39 మంది గ్రేడ్ –2 హెచ్‌ఎంలు ఎంఈవో–2గా ఉద్యోగోన్నతి తీసుకునేందుకు ముందుకొచ్చారు. నిబంధనల మేరకు వారికి కౌన్సెలింగ్ పద్ధతిన కోరుకున్న మండలాల్లో ఎంఈవో–2గా ఉద్యోగోన్నతి కల్పించారు. ఇంకా 7 మండలాల్లో ఎంఈవో–2 పోస్టులు ఉద్యోగోన్నతిపై భర్తీ చేయాల్సి ఉందని డీఈవో చంద్రకళ తెలిపారు. అందరికీ అవకాశం కల్పించటం జరిగిందని, అయితే 39 మంది మాత్రమే ముందుకొచ్చి విల్లింగ్ ఇవ్వటంతో వారికి ఉద్యోగోన్నతులు కల్పించామన్నారు. ఉద్యోగోన్నతులు పొందిన వారంతా సోమవారం నుంచి విధుల్లో ఉంటారు. డిప్యూటీ డైరెక్టర్ జీ.లక్ష్మణరావు, డెప్యూటీ డీఈవో గౌరీ శంకర్, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో...



గుండి వెంకటేశ్వర్లు



తుర్రం లక్ష్మయ్య



సరియం రాజులు

చింతూరు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాతిపదికన ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో చింతూరు, ఎటపాక మండలాలకు చెందిన ముగ్గురు ప్రధానోపాధ్యాయులు ఎంఈవో–2గా పదోన్నతులు పొందారు. చింతూరు ఎంఈవో–2గా మోతుగూడెం జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు గుండి వెంకటేశ్వర్లు, కూనవరం ఎంఈవో–2గా చింతూరు జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు తుర్రం లక్ష్మయ్య, ఎటపాక ఎంఈవో–2గా పినపల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సరియం రాజులు నియమితులయ్యారు. వీఆర్ పురం ఎంఈవో–2కు సంబంధించి కౌన్సెలింగ్ జరగాల్సి ఉంది.

అడ్వాన్స్‌డ్‌లో అదరగొట్టారు

- హాజరైన 18మంది క్వాలిఫై
- గిరి బాలుర ప్రతిభ

మధురవాడ(విశాఖ): మారికవలసలోని రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణ సంస్థకు చెందిన ముగ్గురు విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్–2023లో విశేష ప్రతిభ కనబరిచి.. ఎస్టీ కేటగిరీలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. వీరు దేశంలోని ప్రఖ్యాత ఐఐటీల్లో సీట్లు పొందే అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ నుంచి 18 మంది ప్రవేశ పరీక్షకు హాజరు కాగా.. అందరూ అర్హత సాధించారని ప్రిన్సిపాల్ శివప్రసాద్ చెప్పారు. విజేతలను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ అభిషేక్ అభినందించారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా..



ఉపాధ్యాయుల చక్కని శిక్షణ, అధికారుల ప్రోత్సాహంతో ఈ ర్యాంకు సాధించాను. డుంబ్రిగుడ మండలంలోని మారుమూల పింపలగూడ మా గ్రామం. తల్లిదండ్రులు అర్జున్, దమయంతి వ్యవసాయ కూలీలు. వారు ఎంతో కష్టపడి నన్ను చదివిస్తున్నారు. నేను మరింత బాగా చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడతా..

– జి.సంతోష్, 487వ ర్యాంకర్

తల్లిదండ్రుల కష్టం వృథా కానివ్వను..



మాది హుకుంపేట మండలంలోని మారుమూల పల్లె ముళ్ల మెట్ట. నాన్న సన్యాసిరావు రైతు, అమ్మ సుందరి గృహిణి. వాళ్లు ఎంతో కష్టపడి నన్ను చదివిస్తున్నారు. నాకు ఎస్టీ కేటగిరీలో 583వ ర్యాంకు వచ్చింది. చాలా ఆనందంగా ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవ్వాలనే లక్ష్యంతో చదువుతున్నాను.

– కె. సందీప్

రోబోటిక్స్ ఇంజనీర్ నా లక్ష్యం



రోబోటిక్స్ ఇంజనీర్ అవ్వాలన్నదే నా లక్ష్యం. అందుకు కష్టపడి చదువుతున్నాను. మాది జి.కె. వీధి మండలంలోని సీహెచ్ గంగవరం. నాన్న సోమరా, అమ్మ సోమరి వ్యవసాయ కూలీలు. వారు నన్ను బాగాచదివిస్తున్నారు. ఎస్టీకేటగిరీలో 1625వ ర్యాంకు వచ్చింది. చాలా ఆనందంగా ఉంది.

– పి.మోహన్

జాబ్‌మేళా పోస్టర్ల ఆవిష్కరణ



జాబ్‌మేళా ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

సాక్షి, పాడేరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈనెల 20న పాడేరులో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా ప్రచార పోస్టర్లను అరకు ఎంపీ గొడ్డేటి మాధవి,ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రలు ఆదివారం ఆవిష్కరించారు. విశాఖలోని తమ క్యాంపు కార్యాలయాల్లో వేర్వేరుగా ఈ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు పీఎంఈజీపీ ఇంటర్వ్యూలు

అడ్డతీగల: ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాంలో భాగంగా చిన్న పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు.ఈ ఇంటర్వ్యూలకు వివిధ బ్యాంకుల మేనేజర్లు,వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం హాజరవుతారని చెప్పారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం,పాస్‌పోర్ట్‌సైజు ఫొటో, విద్యార్హత ధ్రువీకరణపత్రం,సాంకేతిక విద్యార్హతలు ఏమైనా ఉంటే ఆ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాసుపుస్తకంతో హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూలు ఉదయం 10.30 గంటలనుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.

మారేడుమిల్లి : ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాంలో భాగంగా చిన్న పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు వెలుగు ఏపీవో శ్యాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు కోసం 94910 53937 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేషనల్ డిఫెన్స్ అకాడమీలో చేరుతా



ప్రవల్లిక శ్రీ ప్రియ

గంగవరం : మండలంలోని ఆముదాలబంద గ్రామానికి చెందిన చవలం ప్రవల్లిక శ్రీ ప్రియ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో 742 ర్యాంక్ సాధించింది. ఈసీఈ కోర్సు చేసి, నేషనల్ డిఫెన్స్ అకాడమీలో చేరాలనేది తన లక్ష్యమని ఆమె తెలిపింది. తల్లిదండ్రులు మల్లుదొర, అనసూయ రెవెన్యూ శాఖలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం వారు గోకవరంలో నివాసం ఉంటున్నారు. మండలానికి చెందిన విద్యార్థిని 742వ ర్యాంక్ సాధించడం పట్ల పలువురు అభినందించారు.

డుంబ్రిగుడలో భారీ వర్షం



డుంబ్రిగుడలో కురుస్తున్న వర్షం

డుంబ్రిగుడ: మండలంలోని ఆదివారం మధ్యాహ్నం నుంచి ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వాతావారణం చల్లబడడంతో స్థానికులు ఉపశమనం పొందారు. పొలాల్లో వర్షపు నీరు చేరడంతో గిరిజన రైతులు వ్యవసాయ పనులు చేసుకునేందుకు అనుకులంగా మారింది.

శబరిలో మునిగి బాలుడి మృతి


విష్ణు మృతదేహం

చింతూరు: మండలంలోని చిడుమూరుకు చెందిన కట్టం విష్ణు(15) అనే బాలుడు శబరినదిలో మునిగి మృతి చెందాడు. గ్రామానికి సమీపంలోని శబరినదిలో స్నానం చేసేందుకు వెళ్లిన విష్ణు ప్రమాదవశాత్తు నదిలో గల్లంతయ్యాడు. రాత్రి 10 గంటలైనా అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆరాతీయగా నదిలో గల్లంతైన విషయం వెల్లడైంది. ఆదివారం ఉదయం నదిలో గాలించగా కుయిగూరు వద్ద మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చింతూరు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధి వీర్రాజు థియేటర్ రోడ్డు లంబసింగి వనం రెస్టారెంట్‌కు ఎదరుగా గల శ్రీసాయి స్కేల్ సెంటర్ గట్టు పక్కన 45 నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతిచెందినట్లు టౌన్ ఎస్‌ఐ గోవిందరావు తెలిపారు. మృతదేహన్ని ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచామన్నారు. మృతుని శరీరంపై లేత నీలం రంగు షర్టు, బ్లాక్ షార్ట్, చేతులపై సత్యవతి అని తెలుగులో పచ్చబొట్టు ఉన్నదని తెలిపారు. వివరాలు తెలిసిన వారు టౌన్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ప్రయాణం.. జర భద్రం

- ఘాట్‌రోడ్డులో శిథిలావస్థలో రక్షణ గోడలు
- ప్రమాదభరితంగా మారిన మర్రిగుడ మలుపు
- ఆందోళనలో వాహనచోదకులు


మర్రిగుడ సమీపంలోని మలుపు వద్ద శిథిలమైన రక్షణ గోడలు

అనంతగిరి: ఘాట్‌రోడ్డు ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అరకు- విశాఖ ఘాట్‌రోడ్డులో పలుచోట్ల మలుపుల వద్ద రక్షణ గోడలు శిథిలావస్థకు చేరాయి. దీంతో ప్రయాణాలకు వాహనచోదకులు భయాందోళన నడుమ ప్రయాణాలు సాగిస్తున్నారు. అరకు-విశాఖ ప్రధాన రహదారి కావడంతో రోజు వందల సంఖ్యలో వాహనచోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఘాట్‌రోడ్డులోని పలుచోట్ల రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకోవడంతో కొన్ని చోట్ల నామమాత్రంగా ఐరన్ పోల్స్, కంచెను ఏర్పాటుచేశారు. అరకు-విశాఖ ప్రధాన రహదారి మర్రిగుడ సమీపంలోని మలుపువద్ద రక్షణగోడకూలిపోవడంతో ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. మలుపు వద్ద సుమారు వంద అడుగులు లోయ ఉండడంతో ప్రయాణాలకు వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ఏ మాత్రం ఆదమరిచి ప్రయాణించినా..ప్రమాదాల బారిన పడక తప్పదని చెబుతున్నారు.

పలు ప్రమాదాలు : మర్రిగుడ మలుపు పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.. విజయనగరానికి చెందిన కొంతమంది వ్యాపారులు అరకులోయకు వచ్చి, తిరిగి వెళుతుండగా, మలుపువద్ద ఆటో అదుపుతప్పి లోయలోకి దూసుకుపోవడంతో ఒకరు మృతి చెందారు. విశాఖపట్నం చెందిన పర్యాటకులు అరకులోయ వచ్చి, తిరిగి వెళుతుండగా, కారులోయలోకి దూసుకుపోవడంతో పలువురు పర్యాటకులు తీవ్రంగా గాయపడ్డారు. లారీ లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలోని డ్రైవర్ గాయపడ్డాడు. ఈ మలుపు వద్ద పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా ఎన్‌హెచ్5 శాఖ అధికారులు స్పందించి, శిథిలావస్థకు చేరుకున్న రక్షణ గోడలు ప్రదేశంలోని నూతన గోడలను నిర్మించి, ప్రమాదాలకు నివారణకు రక్షణ చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఈ విషయంపై ఎగువశోభ పంచాయతీ సర్పంచ్ సింహాద్రి మాట్లాడుతూ ఘాట్‌రోడ్డులో తరచూ జరుగుతున్న ప్రమాదాలపై ఎన్‌హెచ్-5 అధికారులు, మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

బల్రిమామిడి వద్ద వ్యాను బోల్తా

- ఒకరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు


వ్యాన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీమన్నారాయణ


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ చినబాబు

గంగవరం : బల్రిమామిడి సమీపంలో మామిడి పుల్లల లోడుతో గంగవరం వైపు వస్తున్న వ్యాను బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, పది మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం శనివారం రాత్రి పది గంటల సమయంలో జరగ్గా ఆదివారం ఉదయం వరకు బయటకు రాలేదు. ఈ ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ చినబాబు, తహసీల్దార్ శ్రీమన్నారాయణ ఆదివారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎస్‌ఐ చినబాబు ఆదివారం విలేకరులకు తెలిపిన వివరాలివి. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కొత్తపల్లి- కామరాజుపేటకు చెందిన 11 మంది ఏపీ39 డబ్ల్యూ 0402 వ్యానులో వై.రామవరం మండలం తనికిలపాడు గ్రామం నుంచి మామిడి పుల్లలను వ్యానులో లోడు చేసుకొని గంగవరం వైపు వస్తుండగా బల్రిమామిడి- జడేరు మార్గమధ్యంలో మలుపులో వ్యాను అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో వ్యాన్‌పై కూర్చున్న కూలీలు కిందపడిపోగా వారిపై పుల్ల పడిపోవడంతో గోకవరం మండలం కామరాజుపేటకు చెందిన వీరమల్ల సుందర్‌సింగ్ అలియాస్ చిన్నా (29) అనే వ్యక్తి అక్కడక్కడే మృతి చెందాడు. గంగవరం మండలం నెల్లిపూడికి చెందిన శ్రీను, శివనాగు, కె.శ్రీను రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంతుతున్నారని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతి చెందిన సుందర్ సింగ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ఆసుపత్రికి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. వ్యానులో మొత్తం 11 మంది పయాణిస్తుండగా ఒకరు మృతి చెందారు. ఆరుగురికి గాయాలు అయినట్లు ఎస్‌ఐ వివరించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో శశి విద్యార్థుల హవా


రమహర్షిణి


సాయినారాయణ


అభిరామ్


గుణ్వంత్


రాజ్‌కుమార్


కృష్ణ


సాయిరామ్


ఆనంద్‌భాస్కర్


కావ్య

తగరపువలస: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని సంగివలస శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. వివిధ కేటగిరీల్లో ఆలిండియా స్థాయిలో ఎస్.రామహర్షిణి 11వ ర్యాంకు, ఆర్.సాయి నారాయణ 118, కె.అభిరామ్ 152, వి.ఎస్.ఎస్.గుణ్వంత్ 235, వి.రాజ్‌కుమార్ 504, ఆర్.ఎస్.వి.కృష్ణ 751, పి.సాయిరామ్ 802, వి.ఆనంద్ భాస్కర్ 866, బి.కావ్య 991, ఎం.హెచ్.ఎన్.డి.సతీష్ 1135, డి.వి.వి.చైతన్య 1210వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. ఓపెన్ కేటగిరీలో వెయ్యి లోపు ఇద్దరు, 5 వేల లోపు నలుగురు, 10వేల లోపు 10 మందికి ర్యాంకులు లభించాయన్నారు. వివిధ కేటగిరీల్లో వెయ్యి లోపు 9 మంది, 5వేల లోపు 35 మంది, 10వేల లోపు 46 ర్యాంకులు వచ్చినట్లు వివరించారు. ర్యాంకర్లను వైస్ చైర్మన్ నరేంద్ర కృష్ణ, కరస్పాండెంట్ క్రాంతి సుధ తదితరులు అభినందించారు.

కాయలు చెట్లకే!



ఈ ఫొటోలోని రైతు పేరు రెడ్డిపల్లి శంకర్రావు. విశాఖ జిల్లా పద్మనాభం మండలం, శేరిఖండం గ్రామానికి చెందిన ఈయనకు ఏడెకరాల్లో మామిడితోటలున్నాయి. ఈ ఏడాది తన మామిడితోటల ఎరువులకు రూ.50 వేలు, మందులు, దుక్కులు, ఇతర ఖర్చులకు మరో రూ.50 వేలు వెరసి రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. కానీ రూ.30 వేల ఆదాయం కూడా రాలేదు. మార్కెట్లో ప్రస్తుతం క్రేట్ (25 కిలోలు) నాణ్యమైన మామిడికాయలు రూ.250-300కి మించి కొనుగోలు చేయడం లేదు. కోత కూలి, రవాణా చార్జీ సైతం గిట్టుబాటు కాక పక్వానికి వచ్చిన మామిడిని కూడా చెట్లకే వదిలేస్తున్నామని శంకర్రావు ఆవేదన చెందుతున్నాడు.

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన పిల్లి పెద్దకాపుదీ అదే పరిస్థితి. ఈయన మూడెకరాల మామిడితోటను కొనుగోలు చేశాడు. గడచిన రెండేళ్లు కాపు అంతంతమాత్రంగానే కాసింది. ఈ ఏడాదీ సగమే కాపు కాసింది. మొదట్లో ఒకింత మంచి ధరే పలికింది. కానీ అప్పటికి కాయలు పక్వానికి రాలేదు. ఇప్పుడు పక్వానికొచ్చాక కొనే వారే కరువయ్యారు. గాజువాక మార్కెట్‌కు ఆటోలు, వ్యానుల్లో తరలిస్తే రవాణా చార్జీలు, కూలి సొమ్ము రావడం లేదని, దీంతో కోయకుండా చెట్లనే కాయలు వదిలేశానని, ఎవరైనా ఉచితంగా తీసుకెళ్లవచ్చని చెబుతున్నానని పెద్దకాపు చెబుతున్నాడు.


పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో పక్వానికి వచ్చిన కాయలను కోయకుండా చెట్లనే వదిలేసిన దృశ్యం

- మామిడిని కోయకుండానే వదిలేస్తున్న రైతులు
- కోత కూలి, రవాణా చార్జీలు గిట్టుబాటు కాని పరిస్థితి
- ఈ ఏడాది ఎగుమతులు లేని ఫలితం
- టన్నుకు రూ. 10 వేలు కూడా దక్కని దైన్యం
- ధర లేక కుదేలైన మామిడి రైతు

సాక్షి, విశాఖపట్నం: ఇలా శంకర్రావు, పెద్దకాపులదే కాదు.. చాలా మంది మామిడి రైతులది ఇదే పరిస్థితి. కోవిడ్ నుంచి మామిడి రైతుకు కష్టకాలం దాపురించింది. కోవిడ్ మూడేళ్లు అరకొర కాపుతో పాటు మామిడి ఎగుమతులు సరిగా జరగలేదు. ఈ ప్రాంతం నుంచి పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. ఆ ప్రాంత వర్తకులు స్థానిక వ్యాపారులు, దళారుల ద్వారా కొనుగోలు చేసి లారీలు, వ్యాగన్లలో ఆయా రాష్ట్రాలకు తరలిస్తుంటారు. ఇలా సగం పంట ఎగుమతులకు పోను మిగిలినది స్థానిక మార్కెట్లలో విక్రయిస్తారు. ఈ ఏడాది కాపు ఆలస్యమైనా ఎగుమతులు బాగుంటాయని మామిడి రైతులు ఆశించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 15,212 హెక్టార్లలో మామిడి తోటలున్నాయి. వీటి ద్వారా లక్షా 38 వేల టన్నుల దిగుబడి వస్తుందని ఉద్యానశాఖ అధికారుల అంచనా. కానీ ఈ సీజనులోనూ కాపు 50 శాతానికి మించలేదు. కాపు ఆలస్యంగా రావడంతో ఆరంభంలో టన్ను బంగినపల్లి, రసాలు వంటి రకాలకు రూ.80 వేల నుంచి లక్ష వరకు ధర పలికింది. ప్రస్తుతం అది రూ.7-8 వేలకు పడిపోయింది. గతంలో 25 కిలోల క్రేట్ రూ.1,000-1,500 పలకగా ఇప్పుడది రూ.250-300కి దిగజారింది. ఈ ఏడాది కూడా ఎగుమతులు లేకపోవడంతో మార్కెట్లో రూ.100కి 3 కిలోలు విక్రయించగా, ఇప్పుడు ఐదారు కిలోలు లభిస్తున్నాయి. కొన్నాళ్లుగా మార్కెట్లో ఇవి ఇబ్బడి ముబ్బడిగా దర్శనమిస్తున్నాయి.

ఖర్చు తడిసి మోపెడు..

ఈ పరిస్థితుల్లో రైతులు తమ చెట్ల నుంచి మామిడికాయలను కోసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ కాయలు కోయడానికి చెట్లు ఎక్కే నైపుణ్యం ఉన్న కూలీలే ఉండాలి. వీరికి రోజుకు రూ.700 కూలి, మధ్యాహ్నం భోజనంతో పాటు సాయంత్రం మద్యం ఇస్తేనే పనికి వస్తున్నారని రైతులు చెబుతున్నారు. మార్కెట్లో ధర లేకపోయినా కోత కూలీలకు వీటిని సమకూర్చాల్సిందే. కోసిన కాయలను మార్కెట్‌కు వ్యాన్లు, ఆటోల్లో తరలిస్తారు. ఇలా ఒక్కో క్రేట్‌కు కోతకు రూ.50, మందులు, ఎరువులకు రూ.50, రవాణా చార్జి రూ.100, ఆశీలు రూ.30 వెరసి రూ.230 వరకు ఖర్చవుతుంటే రూ.250 కూడా రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

దీంతో శ్రమపడి కోసేకంటే చెట్లను వదిలి పెట్టడమే నయమన్న భావనతో పక్వానికి వచ్చినా కోయడం లేదు. మూడు, నాలుగేళ్ల నుంచి మామిడి అరకొర దిగుబడి, ఆశాజనకంగా లేని ధరతో కుదేలవుతున్నామని మామిడి రైతులు ఎంతో ఆవేదన చెందుతున్నారు.

పోర్టు సరికొత్త రికార్డు

23 షిప్‌ల నుంచి 4.01 లక్షల మెట్రిక్ టన్నుల హ్యాండ్లింగ్

సాక్షి, విశాఖపట్నం: సరకు హ్యాండ్లింగ్‌లో విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) సరికొత్త రికార్డు నెలకొల్పింది. పోర్టులో కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుంచి తొలిసారిగా అత్యధిక సరకు రవాణా చేసిన ఘనత సాధించింది. శనివారం నుంచి 24 గంటల కాల వ్యవధిలో 4,01,875 మెట్రిక్ టన్నుల సరకుని 23 షిప్పుల నుంచి వివిధ బెర్తుల ద్వారా హ్యాండ్లింగ్ చేసింది. ఒక్క రోజులో అత్యధిక హ్యాండ్లింగ్ చేసిన రికార్డుని తిరగరాసింది. ఈ ఏడాది మే 7వ తేదీన 27 షిప్‌ల నుంచి 3,78,760 మెట్రిక్ టన్నుల సరుకు హ్యాండ్లింగ్ ఇప్పటివరకు ఒక్క రోజులో చేసిందిగా రికార్డుల్లో ఉంది. దాన్ని అధిగమించడంపై పోర్టు చైర్మన్ డా.ఎం.అంగముత్తు ట్రాఫిక్ సిబ్బందిని ప్రశంసించారు. పోర్టు సిబ్బంది కలిసికట్టుగా పనిచేయటం ద్వారా మరిన్ని కొత్త రికార్డులను తిరగ రాయవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ ఘనతని సాధించడంలో కృషి చేసిన సిబ్బందికి డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, కార్యదర్శి వేణుగోపాల్ అభినందించారు.

మానవత్వం చాటిన పోలీసులు

తప్పిపోయిన వృద్ధురాలిని ఇంటికి చేర్చిన వైనం


లక్ష్మమ్మను బంధువుకు అప్పగిస్తున్న ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా

సింగరాయకొండ (ప్రకాశం జిల్లా): తన మనవళ్లు, మరికొందరితో కలిసి తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లిన వృద్ధురాలు తప్పిపోయింది. ఒంటరిగా బస్సు ఎక్కి సింగరాయకొండ చేరింది. స్థానిక పోలీసులు స్పందించి ఆమెను బంధువుల వద్దకు చేర్చారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. సింగరాయకొండ ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా కథనం ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం వలసంపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు సద్దల లక్ష్మమ్మ తన మనవళ్లతో కలిసి మొత్తం 15 మంది ఈ నెల 13వ తేదీ తిరుపతి వెళ్లారు. బుధవారం తిరుపతి చేరుకున్న వీరంతా శనివారం స్వామివారి దర్శనం చేసుకుని లడ్డూ ప్రసాదం కోసం వెళ్లేటప్పుడు అక్కడ ఒక ప్రాంతంలో కూర్చోమని లక్ష్మమ్మను చెప్పారు. ఆ తర్వాత లక్ష్మమ్మ ఏదో పనిమీద పక్కకు వచ్చి మళ్లీ తాను కూర్చున్న ప్రదేశానికి వెళ్లే క్రమంలో తప్పిపోయింది. చివరికి తన వద్ద ఉన్న డబ్బుతో బస్సు ఎక్కి తిరుపతి చేరింది. అనంతరం విజయవాడ వెళ్లే బస్సు ఎక్కగా బస్సు కండక్టర్ ఆమె వద్ద ఉన్న రూ.200కు సింగరాయకొండ వరకు టికెట్ ఇచ్చి శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని కందుకూరు రోడ్డు సెంటర్‌లో దింపాడు. అనంతరం ఎటు వెళ్లాలో తెలియక చివరికి మూలగుంటపాడు ప్రాంతానికి వెళ్లడంతో నరాల సుధాకర్ అనే వ్యక్తి ఆమెను తన ఇంటికి తీసుకెళ్లి భోజనం పెట్టి వివరాలు తెలుసుకున్నాడు. రాత్రికి తన ఇంటి వద్దే ఉంచుకుని ఆదివారం ఉదయం ఎస్సైకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా ఆమె పూర్తి వివరాలు తెలుసుకుని కొయ్యూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై ఫోన్ నంబర్ సేకరించి అతనికి ఫోన్ చేసి ఆ ఊరి పెద్దలకు సమాచారం అందించారు. లక్ష్మమ్మ చెప్పిన వివరాల ప్రకారం అక్కడి వారి ఇంటికి వెళ్లిన ఆ గ్రామ పెద్దలు.. తిరుపతిలోనే ఆమెను వెతుకుతూ ఉండిపోయిన మనవడు ఫోన్ నంబర్ సేకరించి ఎస్సైకు చెప్పారు. దీంతో ఎస్సై ఫాతిమా ఆ ఫోన్ నంబర్ ప్రకారం లక్ష్మమ్మ మనవడికి ఫోన్ చేశారు. ఆమె తన వద్ద ఉందని చెప్పడంతో మనవడు కొండలు వెంటనే గూడూరు సమీపంలో నివసిస్తున్న తన బంధువులకు సమాచారం అందించారు. శివసాయి దుర్గాప్రసాద్ అనే యువకుడిని లక్ష్మమ్మ వద్దకు పంపారు. తన వద్దకు వచ్చిన దుర్గాప్రసాద్‌కు లక్ష్మమ్మను ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా అప్పగించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా మానవత్వం చూపి వృద్ధురాలిని బంధువుల వద్దకు చేర్చిన ఎస్సై ఫాతిమాను, ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషాను ప్రజలు అభినందించారు.

విద్యుత్ షాక్‌తో మూడు పశువులు మృతి


విద్యుత్ షాక్‌తో మరణించిన పశువులు

నాతవరం : సుందరకోట పంచాయతీ శివారు బమ్మిడికలోద్దు గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి మూడు పశువులు మృతి చెందాయి. ఎప్పటి మాదిరిగానే బమ్మిడికలోద్దు గ్రామానికి చెందిన కొండపల్లి లోవరాజు, తూబే సోమరాజుకు చెందిన ఆవు, ఎద్దు, పెయ్యి శనివారం మేతకు తీసుకెళ్లి కొండపోడు భూముల్లో వదిలేశారు. ప్రతి రోజు సాయంత్రం అయ్యేసరికి పశువులు ఇంటికి వచ్చేవి కానీ ఆ రోజు రాలేదు. మరుసటి రోజు ఆదివారం ఉదయం ఆ ప్రాంతంలో పరిశీలించగా విద్యుత్ స్తంభం వద్ద వేలాడుతున్న వైర్లు తగలడంతో విద్యుత్ షాక్‌తో సంఘటన స్థలంలో మూడు పశువులు మృతి చెంది కన్పించాయి. పశువుల మృతితో లక్షా 10 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఆర్థికంగా నష్టపోయిన గిరిజన రైతులను ప్రభుత్వం నుంచి సాయం వచ్చేలా చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'జగనన్న ఆణిముత్యాలు' అవార్డు గ్రహీతలకు అభినందనలు




ప్రశంసాపత్రం, నగదు, మెడల్స్ అందుకున్న ర్యాంకర్లు దివ్య, దీపిక, ఉమ


పవన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

కొయ్యూరు: గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలల విభాగంలో రావణాపల్లి పాఠశాలకు చెందిన గాం దివ్య జిల్లాలోనే టాపర్‌గా నిలిచారు. ఈ మేరకు ఇటీవల పాడేరులో జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో విద్యార్థినికి రూ.50వేల నగదు, ప్రశంసాపత్రాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణల చేతుల మీదుగా అందుకున్నారు. ఇందులో భాగంగానే ఆదే పాఠశాలకు చెందిన లోచలి దీపిక, కొయ్యూరు గురుకుల పాఠశాల విద్యార్థి బిడిజన పవన్ రెండో స్థానంలో, బురిటి ఉమ మూడో స్థానంలో నిలిచారు. వీరికి రూ.30వేలు, రూ.15 వేలను ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను హెచ్ఎం మృదుభాషిణి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ మోహన్‌పవన్ తదితరులు ఆదివారం అభినందనలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

చోడవరం రూరల్ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్నిప్రమాదంలో సుమారు 60 వేల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. పట్టణ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక వైపున ఉన్న న్యూ విద్యానగర్‌లో ఉంటున్న ఎం.బుచ్చిరాజు ఇంట్లో ఆదివారం ఉదయం పది గంటల సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదం సంభవించిన సమయంలో బుచ్చిరాజు కుటుంబీకులు ఇంట్లో లేరు. పొరుగు ఊరు వెళ్లారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన ప్రమాదంలో ఫ్రిజ్ కంప్రెషర్ పేలిపోయింది. ఫ్రిజ్ లోపలి భాగం మంటల్లో కాలిపోయింది. ఎలక్ట్రికల్ ఇన్వెర్టర్ అగ్నికి ఆహుతయ్యాయి. ఇంటిలోంచి పొగలు, కారు వాసన వస్తుండడంతో చుట్టు పక్కల వారు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ప్రమాద సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్ వి.రామస్వామి, లీడింగ్ ఫైర్‌మేన్ యల్లపు నూకరాజు సిబ్బందితో ప్రమాదస్థలికి చేరుకుని, గునపంతో తలుపులను పెకలించి లోనికి ప్రవేశించారు. కమ్ముకున్న పొగలలో మంటలను అదుపు చేశారు. దీంతో పెద్ద ముప్పు తప్పింది.